# అప్పన్న సేవలో భారత క్రికెటర్లు



హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): భారత క్రికెటర్లు తిలక్ వర్మ, వాషింగ్టన్ సుందర్ గురువారం సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన తొలి మ్యాచ్ సందర్భంగా వారు సింహాచలం అప్పన్న దర్శనం చేసుకున్నారు. సిరీస్‌లో రాణించాలని, జట్టు విజయం సాధించాలని వారు స్వామివారిని కోరుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి ఆశీర్వచనం అందించారు. యువకులతో నిండిన భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహిస్తుండగా, రెండు జట్లు అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడుతున్నాయి.

# క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడి



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఏస్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్, పురుషుల డబుల్స్ జోడి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్ ప్రిక్వార్టర్స్‌లో 21-12, 21-18 స్కోరుతో డెన్మార్క్‌కు చెందిన మాగ్నస్ జొహాన్నెసెన్‌పై 40 నిమిషాలలో విజయం నమోదు చేశాడు. పురుషుల సింగిల్స్ బరిలో నిలిచిన ఏకైక భారత ఆటగాడు ప్రణయ్ తదుపరి రౌండ్‌లో జపాన్‌కు చెందిన మూడో సీడ్ కొడై నరవోకతో తలపడతాడు. పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్ జోడి సాత్విక్-చిరాగ్ 21-15, 21-16తో జపాన్ ద్వయం అకిరా కోగ-తైచి సయాటోలను ఓడించారు. క్వార్టర్స్‌లో వారు ఇండోనీసియాకు చెందిన లియో రాలి కార్నాండో-డేనియల్ మార్టిన్‌ను ఎదుర్కొంటారు.

# సామ్యూల్స్‌పై నిషేధం



దుబాయ్: వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై వేటు పడింది. అవినీతి నిరోధక నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) గురువారం అతడిని ఆరేండ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. 2019లో అబుదాబి వేదికగా జరిగిన టీ10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ నిబంధనలు ఉల్లంఘించినట్లు ఐసీసీ విచారణలో తేలింది. నిషేధం ఈనెల 11 నుంచి అమల్లోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. లీగ్ సందర్భంగా సామ్యూల్స్ నిబంధనలను అతిక్రమిస్తూ పలు ప్రయోజనాలు పొందినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని అవినీతి నిరోధక బృందం దృష్టికి తీసుకువెళ్లని కారణంగా ఈ విండీస్ మాజీ క్రికెటర్‌పై సస్పెన్షన్ వేసినట్లు ఐసీసీ జనరల్ మేనేజర్ అలెక్స్ మార్షల్ పేర్కొన్నాడు. విండీస్ తరపున 71 టెస్టులు, 207 వన్డేలు, 67 టీ20లు ఆడిన సామ్యూల్స్ 2018లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.



## హైదరాబాద్ బోణీ

**విజయ్ హజారే టోర్నీ**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జైపూర్ వేదికగా జరిగిన విజయ్ హజారే వన్డే టోర్నీలో హైదరాబాద్ జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. గురువారం మణిపూర్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత మణిపూర్ నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగులు చేసింది. బికాశ్‌సింగ్(41) ఫర్వాలేదనిపించగా, హైదరాబాద్ బౌలర్లు రవితేజ(3/71), తనయ్ త్యాగరాజన్(2/24), రక్షణ్‌రెడ్డి(2/28) రాణించారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ 29.5 ఓవర్లలో 208/5 స్కోరు చేసింది. రాహుల్‌సింగ్(70), చందన్ సహనీ(41) ఆకట్టుకున్నారు.

## ఫైనల్లో హారిక ఓటమి

చెన్నై : జులియస్ బేర్ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ టోర్నీ ఫైనల్లో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక అపజయం పాలైంది. టైటిల్ పోరులో హారిక 11-15 స్కోరుతో చైనాకు చెందిన హోవ్ ఇఫాన్ చేతిలో ఓడిపోయింది. వెంటవెంటనే మ్యాచ్‌లు ఆడాల్సి రావడంతో ఫైనల్లో ఓడిపోయినట్టు, వచ్చే యేడాది మరింత సన్నద్ధతతో పోటీకి హాజరౌతానని హారిక తెలిపింది. రన్నరప్ హారికకు 4,230.77 డాలర్లు (సుమారు రూ.3,52,500) దక్కగా, విజేత ఇఫాన్ 10వేల డాలర్లు (రూ.8,33,185) చేజిక్కించుకుంది.

## ఐపీఎల్‌కు స్టోక్స్ డుమ్మా


చెన్నై : ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ వచ్చే యేడాది ఐపీఎల్‌కు దూరంగా ఉండనున్నాడు. పనిభారం ఎక్కువవడంతో స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం వెల్లడించింది. ఈ యేడాది ఐపీఎల్‌కు ముందు చెన్నై జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్న స్టోక్స్ మోకాలి నొప్పితో బాధపడుతూ కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. వన్డే క్రికెట్‌నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన స్టోక్స్ ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనతో ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు.

### తొలి టీ20లో ఆస్ట్రేలియా చిత్తు

# భారత్ బోణీ

### మెరిసిన సూర్య, ఇషాన్

### ఇంగ్లిస్ సెంచరీ వృథా



ఇంగ్లిస్ (110)

వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం నుంచి త్వరగానే తేరుకున్న టీమ్‌ఇండియా.. ఆస్ట్రేలియాతో తొలి టీ20లో ఘనవిజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖ సాగర తీరాన సాగిన పోరులో భారత్ బోణీ కొట్టింది!

వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించగా.. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో అభిమానులను నిరాశ పరిచిన 360 డిగ్రీస్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ ఈసారి భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు.

మొత్తానికి మెగా పరాజయాన్ని మరిచి ముందడుగు వేసిన యంగ్ ఇండియా.. భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నది!

విశాఖపట్నం: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైన భారత జట్టు.. ఆ ఓటమి నుంచి త్వరగానే బయటపడింది. సీనియర్ల గైర్హాజరీలో యువ జట్టుతో బరిలోకి దిగిన యంగ్ ఇండియా.. కంగారూలపై కొంతలో కొంత ప్రతీకారం తీర్చుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం విశాఖపట్నంలో జరిగిన మొదటి టీ20లో భారత్ 2 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయినా.. భారత జట్టుకు తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించిన సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. జోస్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్సర్లు) అద్వితీయ సెంచరీతో కదంతొక్కగా.. స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, రవి బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. ముఖేశ్ కుమార్ (0/29) పొదుపుగా బౌలింగ్ చేయగా.. తక్కిన వాళ్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన టీమ్‌ఇండియా సరిగ్గా 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది. సమన్వయ లోపంతో రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి కూడా ఎదుర్కోకుండానే వెనుదిరగగా.. యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఉన్నంతసేపు ధాటిగా ఆడాడు. కొత్త కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) హాఫ్ సెంచరీలతో కదంతొక్కారు. తెలంగాణ కుర్రాడు ఠాకూర్ తిలక్ వర్మ (12; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలువలేకపోగా.. ఆఖర్లో తీవ్ర ఒత్తిడిని అధిగమించి రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) మిగిలిన పని పూర్తిచేశాడు. ఆసీస్ బౌలర్లలో తన్వీర్ సంఘా రెండు వికెట్లు పడగొట్టగా.. ముగ్గురు భారత బ్యాటర్లు రనౌట్ అయ్యారు. సూర్యకుమార్‌యాదవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం తిరువనంతపురంలో రెండో టీ20 జరగనుంది.

**ఈ ఆట ఫైనల్లో ఆడుంటేనా!**

ఛేదనలో భారత్‌కు శుభారంభం దక్కలేదు. తొలి ఓవర్‌లోనే రుతురాజ్ వెనుదిరగగా.. కాసేపటికే యశస్వి ఔటయ్యాడు. దీంతో భారత్ 22/2తో కష్టాల్లో పడింది. ఈ సమయంలో ఇషాన్ కిషన్, సూర్యకుమార్ చక్కటి పోరాటం కనబర్చారు. ఇటీవల ముగిసిన వరల్డ్‌కప్‌లో ప్రాతినిధ్యం వహించిన ఈ ఇద్దరూ కంగారూలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగారు. ఆరంభంలో కాస్త ఆచితూచి ఆడటంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోగా.. క్రీజులో కుదురుకున్నాక భారీ షాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో మొదట ఇషాన్ 37 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. సూర్య 29 బంతుల్లో ఆ మార్క్ చేరుకున్నాడు. వరల్డ్‌కప్ ఫైనల్లో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో బ్యాటింగ్ చేస్తూ.. తనదైన మార్క్ చూపెట్టలేకపోయిన సూర్యకుమార్.. ఈ సారి ధాటిగా ఆడాడు. మైదానం నలువైపులా షాట్లు ఆడుతూ పరుగులు రాబట్టాడు. మిస్టర్ 360 దూకుడు చూసిన ప్రతి ఒక్కరూ 'ఈ ఆట ఫైనల్లో ఆడుంటేనా..!' అనుకోక మానరు. విజయానికి 15 పరుగులు కావాల్సిన సమయంలో సూర్య ఔటైనా.. రింకూ సింగ్ లాంఛనాన్ని ముగించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా: 208/3 (ఇంగ్లిస్ 110, స్మిత్ 52; ప్రసిద్ధ్ 1/50, రవి 1/54), భారత్: 20 ఓవర్లలో 209/8 (సూర్యకుమార్ 80, ఇషాన్ 58; తన్వీర్ 2/47).

**9** 2021 నుంచి పొట్టి ఫార్మాట్‌లో భారత జట్టుకు సారథ్యం వహించిన తొమ్మిదో కెప్టెన్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

## కిక్కిరిసిన స్టేడియం

వన్డే ప్రపంచకప్ ఫైనల్లో పరాజయం అనంతరం సరిగ్గా నాలుగు రోజుల తర్వాత టీమ్ ఇండియా తిరిగి మైదానంలో అడుగుపెట్టగా.. అభిమానులు బ్రహ్మరథం పట్టారు. వరల్డ్ కప్ ఫైనల్లో భారత జట్టు ప్రదర్శన ప్రేక్షకుల మనసులపై ఎలాంటి ప్రభావం చూపలేదని విశాఖ నగరం నిరూపించింది. మ్యాచ్ ఆరంభానికి రెండు గంటల ముందు నుంచే.. ఏసీఏ వీడీసీఏ మైదానానికి పెద్ద సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. ఎటు చూసినా నీలి జెర్సీలతో స్టాండ్స్ నిండిపోగా.. మనవాళ్లు మంచి షాట్ ఆడిన ప్రతిసారీ.. మైదానం ఊగిపోయింది. ముఖ్యంగా ఇషాన్, సూర్యకుమార్ భారీ షాట్లతో విరుచుకుపడుతున్న సమయంలో అభిమానులు స్టేడియాన్ని హోరెత్తించారు. దీంతో ఫలితంతో సంబంధం లేకుండా.. టీమ్ ఇండియాకు తమ మద్దతు కొనసాగుతుందని అభిమానులు తేల్చి చెప్పినట్లైంది!



**1** టీ20ల్లో భారత్‌కు ఇదే (209) అత్యధిక ఛేదన. గతంలో హైదరాబాద్‌లో చేసిన 208 పరుగుల చేజింగ్ రెండో స్థానానికి చేరింది.

సూర్యకుమార్ (80)

---

## పడుతూ.. లేస్తూ..

**తులం పసిడి రూ. 61,970**

హైదరాబాద్, నవంబర్ 23: బంగారం ధరలు పడుతూ.. లేస్తూ సాగుతున్నాయి. గత పది రోజులుగా తీవ్ర ఒడిదుడుకుల నడుమ రేట్లు అక్కడక్కడే ఉంటుండగా, గురువారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం రూ.61,970గా ఉన్నది. 22 క్యారెట్ రూ.56,800 ఉండగా.. బుధవారంతో పోల్చితే రూ.50 చొప్పున పడిపోయాయి. మరోవైపు ఢిల్లీలో 10 గ్రాములు మేలిమి బంగారం రూ.62,170 పలికింది. కాగా, కిలో వెండి హైదరాబాద్‌లో రూ.200 పెరిగి రూ.79,200గా ఉన్నది. ఢిల్లీలో రూ.76,400 వద్ద నిలిచింది. ఇక అంతర్జాతీయంగా ఔన్సు పసిడి 1,994 డాలర్లు, వెండి 23.66 డాలర్లుగా ఉన్నది.

### తెలంగాణలో సుందరం హోమ్

చెన్నై, నవంబర్ 23: గృహ రుణాల సంస్థ సుందరం హోమ్ ఫైనాన్స్..తాజాగా తెలంగాణ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. వచ్చే ఏడాదికాలంలో తన స్మాల్ బిజినెస్ లోన్ల శాఖలను రెండింతలు పెంచుకోవాలని చూస్తున్న సంస్థ.. తెలంగాణలో త్వరలో నూతన శాఖ ను ప్రారంభించాలనుకుంటున్నట్టు కంపెనీ ఎండీ లక్ష్మీనారాయణన్ దొరైస్వామి తెలిపారు.



## ఒక్క రీచార్జ్‌తో 171 కిలోమీటర్లు

హైదరాబాద్, నవంబర్ 23: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ మరో రెండు మోటర్‌సైకిళ్లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 171 కిలోమీటర్లు ప్రయాణించే ఈ మోటర్‌సైకిల్‌ను 110 సీసీ సామర్థ్యంతో సంస్థ రూపొందించింది. ఎకోడ్రిఫిట్ 350 పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. 3.5 కిలోవాట్ లీ-అయాన్ బ్యాటరీ కలిగిన ఈ బైకు గంటకు 75 కిలోమీటర్ల వేగంగా దూసుకుపోనున్నదని, రోజువారిగా అత్యధికంగా తిరిగేవారికి ఈ బైకుతో నెలకు రూ.7 వేల వరకు ఆదా కానున్నట్టు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. ఇప్పటికే ఈ బైకు దేశవ్యాప్తంగా ఉన్న షోరూంలో అందుబాటులో ఉంచినట్టు, కొనాలనుకునేవారు టెస్ట్ డ్రైవ్ చేసుకోవచ్చునని చెప్పారు.

వాణిజ్య



# గచ్చిబౌలి అధరహో

**చదరపు అడుగు రూ.6,355 • దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో టాప్ • అనరాక్ తాజా నివేదిక**

అభివృద్ధి ఎక్కడా? అంటే.. ఇక్కడా అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ లేచి చాటుతున్నది.

అవును.. సమగ్ర అభివృద్ధికి అసలు సిసలు ప్రామాణికమైన రియల్ ఎస్టేట్ రంగం.. రాష్ట్రంలో ప్రగతిపథంలో పయనిస్తున్నది మరి.

ఒకటి కాదు.. రెండు కాదు.. యావత్తు దేశ, విదేశీ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీలన్నీ హైదరాబాదే టాప్ అంటున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం పనితీరును చెప్పకనే చెప్తున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 23: మొన్న నైట్ ఫ్రాంక్.. నిన్న వెస్టియన్.. నేడు అనరాక్.. రిపోర్టు ఏదైనా చెప్పేదొక్కటే. రియల్ ఎస్టేట్ రారాజు హైదరాబాద్ అనే. తాజాగా విడుదలైన నివేదికలో దేశంలోని టాప్-7 నగరాల్లో హైదరాబాదే ఆకర్షణీయమని అనరాక్ పేర్కొన్నది. ఇక్కడి డిమాండ్‌తో సగటు నివాస గృహాల ధరలు భారీగా పెరిగాయని గురువారం ఇచ్చిన రిపోర్టులో ఈ ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ స్పష్టం చేసింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో గడిచిన మూడేండ్ల రియల్ ఎస్టేట్ మార్కెట్ తీరుతెన్నుల ఆధారంగా ఈ నివేదికను అనరాక్ తయారు చేసింది.

**గచ్చిబౌలిదే అగ్రస్థానం**

హైదరాబాద్‌సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గడిచిన మూడేండ్లలో ఇండ్ల ధరలు డిమాండ్ ఆధారంగా సగటున 13 నుంచి 33 శాతం మేర పెరిగినట్టు అనరాక్ ఈ సందర్భంగా తెలిపింది. ఇందులో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో రేట్లు గరిష్ఠంగా 33 శాతం పెరిగినట్టు స్పష్టం చేసింది. 2020 అక్టోబర్‌లో చదరపు అడుగు రూ.4,790 పలికితే.. ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.6,355గా ఉందని వివరించింది. అలాగే కొండాపూర్‌లోనూ చదరపు అడుగు ధర 31 శాతం పెరిగి రూ.4,650 నుంచి రూ.6,090కి ఎగిసినట్టు తేలింది.




- **ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో**ని గ్రేటర్ నోయిడా వెస్ట్‌లో 27 శాతం, సెక్టార్ 150 (నోయిడా)లో 25 శాతం, రాజ్ నగర్ ఎక్స్‌టెన్షన్ (ఘజియాబాద్)లో 21 శాతం చొప్పున పెరిగిన సగటు చదరపు అడుగు ధర.
- **పుణె** రియల్ ఎస్టేట్ మార్కెట్ విషయానికొస్తే.. ఇక్కడ ఐటీ రంగానికి పేరొందిన వాఘోలి, హింజేవాడి, వాకడ్ ప్రాంతాల్లో సగటున 25, 22, 19 శాతం చొప్పున పెరిగిన చదరపు అడుగు ధరలు.
- **చెన్నైలో** ప్రసిద్ధికెక్కిన పెరుంబాక్కమ్‌లో 19 శాతం, గుడువంచెరిలో 17 శాతం, పెరంబూర్‌లో 15 శాతం చొప్పున చదరపు అడుగు సగటు ధరలు పెరిగాయి. ఇక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్లో స్తబ్ధత ఉన్నది.
- **బెంగళూరులో**ని వైట్‌ఫీల్డ్‌లో 29 శాతం, తనిసంద్ర మెయిన్ రోడ్డులో 27 శాతం, సర్జాపూర్ రోడ్డులో 26 శాతం మేర పెరిగిన చదరపు అడుగు సగటు ధరలు.
- **ముంబై-ఎంఆర్‌లో**ని కీలక ప్రాంతాలైన లోయర్ పారెల్‌లో 21 శాతం, అంధేరీలో 19 శాతం, వొర్లీలో 13 శాతం మేర పెరిగిన చదరపు అడుగు సగటు ధరలు.
- **కోల్‌కతాలో** టాప్-3 ప్రాంతాలైన జోకా, రాజర్హత్, ఈఎం బైపాస్‌ల్లో సగటున 24, 19, 13 శాతం చొప్పున పెరిగిన చదరపు అడుగు ధరలు.

**పెద్దిండ్లకు గిరాకీ**

గతంతో పోల్చితే ఇండ్ల కొనుగోలుదారుల వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నదని, బడ్జెట్ ఎక్కువైనా.. విశాలమైన ఇండ్లను కొనేందుకే మొగ్గు చూపుతున్నారని అనరాక్ రిసెర్చ్ హెడ్ ప్రశాంత్ థాకూర్ అన్నారు. అన్ని సదుపాయాలుండే చోటునే ఎంచుకుంటున్నారని, హైదరాబాద్ ఈ విషయంలో దేశంలోని ఇతర ప్రధాన నగరాల కంటే ముందున్నదని చెప్పారు. ఇక గత కొన్నేండ్లుగా స్థిరాస్తి ధరలు పెరుగుతూపోతున్నాయని, ఇందుకు కారణం మార్కెట్‌లో డిమాండ్‌తోపాటు, పెరిగిన నిర్మాణ ఖర్చులు కూడా అని సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) ఎండీ రవీ అగర్వాల్ తాజా రిపోర్టుపై స్పందించారు.

### ఇటీవలి రిపోర్టుల్లో..

అక్టోబర్‌లో హైదరాబాద్‌లో 5,787 ఇండ్లు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.3,170 కోట్లుగా ఉన్నది. నిరుడుతో పోల్చితే 25 శాతం పెరిగాయి. లగ్జరీ ఇండ్లకు క్రమేణా గిరాకీ పెరుగుతున్నది.

-నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ ఆఫీస్ స్పేస్‌కు పెద్ద ఎత్తున డిమాండ్ కనిపిస్తున్నది. బెంగళూరును దాటి ఇక్కడి కార్యాలయ స్థలాలకు కార్పొరేట్ల నుంచి పోటీ నెలకొనడం విశేషం. ప్రధాన నగరాలతో పోల్చితే లీజింగ్ పెరిగింది.

-వెస్టియన్

హైదరాబాద్ వంటి నగరాల దన్నుతోనే భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్.. ఆఫీస్‌కైనా, ఇంటికైనా ఇప్పుడు హాట్ ఫేవరేట్.

-నరెడ్కో

ఔషధ, ఐటీ, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో వృద్ధి.. హైదరాబాద్‌కు జోష్‌నిస్తున్నది. ఇక్కడి ల్యాండ్, ఫ్లాట్, ఇండిపెండెంట్, విల్లాలకు ఆదరణ భేష్.

-క్రెడాయ్

## పీపుల్స్ ఫెస్టీలో రాష్ట్ర స్టార్టప్‌లు

**ఎంపికైన ఐదు గ్రామీణ ఆవిష్కరణలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పటికే పలు స్టార్టప్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటగా..తాజాగా మరో ఐదు స్టార్టప్‌లు ఇందుకు సిద్ధమయ్యాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఈ నెల 28 నుంచి డిసెంబర్ 2 వరకు జరగనున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమం 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్(పీఎఫ్‌ఐ 2023)లో ప్రదర్శించేందుకుగాను గ్రామీణ ప్రాంతాలకు చెందిన 5 స్టార్టప్‌లు ఎంపికయ్యాయి. గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్‌ఐసీ) విస్తృతంగా చేపట్టిన కార్యక్రమాల వల్లనే దేశీయ స్థాయిలో ప్రదర్శించడానికి సిద్ధమయ్యాయని టీఎస్‌ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం తెలిపారు.

**ఢిల్లీలో ప్రదర్శనకు ఎంపికైన స్టార్టప్‌లు...**

- ఎస్‌కే రాజాలి పాష (సేఫ్టీ అలర్ట్ హెల్మెట్ ఫర్ ది డెఫ్ అండ్ డంబ్)
- అల్లాడి ప్రభాకర్ (హెల్త్ బెడ్- మల్టీపంక్షనల్)
- రాజు ముప్పారపు ( పవర్ సేవింగ్ స్ట్రీట్ లైట్ కంట్రోల్ ఇన్నోవేషన్)
- తేజస్వి వెలుగపల్లి బృందం ( సస్టెయినబుల్ స్ట్రీట్ వెండింగ్ సొల్యూషన్, రెడ్యూసెస్ వేస్ట్)
- ఎం గోపాల్ సింగ్ ( ఆటోమేటెడ్ టైమర్ కంట్రోల్స్ వాల్యూ ఇన్ అగ్రికల్చర్ అండ్ గ్యాస్ సిలిండర్స్)

### ఐఆర్‌ఈడీఏ ఆఫర్‌కు

## భారీ స్పందన

ముంబై, నవంబర్ 23: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) తొలి పబ్లిక్ ఆఫర్‌కు ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఆఫర్ చివరిరోజైన గురువారం 38.80 రెట్లు అధికంగా బిడ్స్ సంపాదించింది. 47.09 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తుండగా 1,827 కోట్ల షేర్లకు బిడ్స్ అందాయి. సంస్థాగత ఇన్వెస్టర్లకు రిజర్వ్‌చేసిన కోటా 104 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ కాగా, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటాకు 24 రెట్ల స్పందన లభించింది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 7.73 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది. రూ.30-32 ప్రైస్‌బ్యాండ్‌తో ఈ కంపెనీ ఐపీవో జారీ అయ్యింది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఐఆర్‌ఈడీఏ రూ.643 కోట్లు సమీకరించింది.

### ఆర్బీఐ రుణ వృద్ధికి అడ్డంకి

న్యూఢిల్లీ, నవంబర్ 23: బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు 125 శాతం రిస్క్ వెయిటేజితో పర్సనల్ లోన్స్ ఇవ్వాలంటూ ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ నిబంధనల్ని కఠినతరం చేయడంతో రుణ వృద్ధికి బ్రేకులు పడతాయని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. ఆర్బీఐ తాజా నిబంధనల కారణంగా సెక్యూరిటీ లేకుండా ఇచ్చే ప్రతీ పర్సనల్ రుణం మొత్తంపై ఇక నుంచి ఆయా ఆర్థిక సంస్థలు ఎక్కువ మూలధనాన్ని పక్కన పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇటీవలి సంవత్సరాల్లో సెక్యూరిటీ లేని వినిమయ రుణాలు జోరుగా పెరగడంతో ఏర్పడే వ్యవస్థాగత రిస్క్‌లను నిరోధించడానికి రెగ్యులేటర్ చర్యలు తీసుకోవడం క్రెడిట్ పాజిటివ్‌గా తాము చూస్తున్నట్టు ఫిచ్ ఒక రిపోర్ట్‌లో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో బ్యాంక్‌ల అన్‌సెక్యూర్డ్ క్రెడిట్ కార్డు రుణాలు 29.9 శాతం, పర్సనల్ రుణాలు 25.5 శాతం వృద్ధిచెందాయి.

## ఎల్ఐసీ నుంచి 3-4 కొత్త పాలసీలు

న్యూఢిల్లీ, నవంబర్ 23: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో న్యూ బిజినెస్ ప్రీమియం ఆదాయంలో రెండంకెల వృద్ధి సాధించేందుకు వచ్చే కొద్ది నెలల్లో 3-4 కొత్త పాలసీలను ప్రవేశపెట్టేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సిద్ధమవుతున్నది. 'నిరుడుతో పోలిస్తే ఆదాయ వృద్ధి రెండంకెల్లో ఉంటుందని మేము అంచనా వేస్తున్నాం. ఇటీవల రిటైల్ వ్యాపారం మెరుగుపడుతున్నందున, అంచనాల మేరకు వృద్ధి సాధిస్తాం. ఇందుకు తోడు కొన్ని కొత్త ఆకర్షణీయమైన ఉత్పత్తుల్ని ప్రవేశపెట్టబోతున్నాం' అంటూ ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి చెప్పారు. డిసెంబర్ తొలి వారంలో ఎల్ఐసీ ఒక కొత్త పాలసీని విడుదల చేస్తుందని, అది మార్కెట్‌ను ఎంతగానో ఆకర్షిస్తుందని భావిస్తున్నట్టు వెల్లడించారు.

**గ్యారంటీ రాబడి హామీతో పాలసీ**

డిసెంబర్‌లో విడుదల చేయనున్న పాలసీకి చెందిన కొన్ని ఫీచర్లను మొహంతి వివరిస్తూ హామీ మేరకు రాబడిని అందిస్తుందని, కాల పరిమితి ముగిసిన తర్వాత బీమా మొత్తంలో 10 శాతం చొప్పున పాలసీదారు జీవితాంతం అందుకుంటాడని తెలిపారు. ఈ కొత్త ప్రాడక్ట్ మార్కెట్లో సంచలనం సృష్టిస్తుందని, 20-25 ఏండ్ల తర్వాత అందుకునే రాబడుల కోసం ఇప్పుడు ఎంత చెల్లించాలన్నది తెలుసుకోవాలని ప్రతీ ఒక్కరూ ఆసక్తి చూపిస్తారన్నారు. ఈ కొత్త పాలసీపై రుణ సదుపాయం, కాలపరిమితికి ముందే విత్‌డ్రా చేసుకునే అవకాశం కూడా ఉన్నది. పాలసీదార్లు, షేర్‌హోల్డర్ల ప్రయోజనం కోసమే గ్యారంటీ రాబడి పాలసీలు ప్రవేశపెడుతున్నామని, తమ కంపెనీలో మదుపు చేసిన వారిలో చాలావరకూ పాలసీదారులేనని వివరించారు. తదుపరి నెలల్లో మరో 2-3 పాలసీలు తెస్తామన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.